# ఫెడరలిజాన్ని దెబ్బతీస్తున్న మోడీ పాలన

బి.వి.రాఘవులు




PSBH ప్రజాశక్తి బుక్‌హౌస్

English Heading : **"Federalism Undermined Under Modies Rule"**

*Aricile Published in English Marxist January- June 2024 Issue*

రచన : **బి.వి.రాఘవులు**

అనువాదం : **ఎం. వి. ఎస్. శర్మ**

**ప్రచురణ సంఖ్య** : 1867

**ప్రథమ ముద్రణ** : జులై, 2025

**ప్రతులు** : 2000

వెల : ₹ 10/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విశాఖపట్నం, ఏలూరు, విజయవాడ

గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు

***website : www.psbh.in***

prajasaktipublishinghouse@gmail.com

**ముద్రణ**

ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై.లి. విజయవాడ

167019

# ముందుమాట

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ విడిపోయిన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విభజన హామీలను సంపూర్ణంగా అమలు చేయాలని, ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హెూదా కల్పిస్తామన్న పార్లమెంటు హామీని నెరవేర్చాలని ఆందోళన కొనసాగుతూనేవుంది. పదకొండేళ్ళు గడిచిపోయినా ఆ డిమాండ్ కు అతీ గతీ లేదు. విభజన హామీల అమలు కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంది. అమరావతి లో రాజధాని నిర్మాణానికి గాని, పోలవరం ప్రాజెక్టును పునరావాసంతో సహా పూర్తి చేయడానికి గాని, వెనుకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేయడానికి గాని, కడపలో ఉక్కు ఫాక్టరీని, రామాయపట్నంలో ఓడరేవును నిర్మించడానికి గాని కేంద్రం ఒక్క పైసా విదల్చడం లేదు. "పిడికెడు మట్టి, ముంతడు నీళ్ళు" గా ప్రధాని మోడీ హామీలు మిగిలిపోయాయి. ఉన్న విశాఖ ఉక్కును కూడా అంగట్లో అమ్మడానికి తయారైపోతున్నారు.

ఇంత అన్యాయం మన రాష్ట్రానికి జరుగుతున్నా, రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు టిడిపి, వైసిపి, జనసేన లు మూడూ ఆ మోడీ కరుణాకటాక్ష వీక్షణాలకోసమే నిరంతరం తాపత్రయపడుతూండడం రాజకీయాల్లోనే విడ్డూరంగా అనిపించే విషయం. రాష్ట్ర హక్కులకోసం తమకన్నా పోరాడగలిగేది వేరే ఎవరూ లేరని చెప్పుకుంటూనే, కేంద్రంతో ఈ రాష్ట్ర హక్కుల గురించి, విభజన హామీల అమలు గురించి గట్టిగా నోరెత్తి అడగలేని దౌర్బల్యం ఈ మూడు పార్టీలనూ పట్టి పీడిస్తోంది.

రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి, కేంద్రం అనుసరిస్తున్న బాధ్యతారహితమైన వైఖరి గురించి ఒక వైపు రాష్ట్ర ప్రజానీకానికి అవగతం ఔతున్నా, ఎందుకిలా జరుగుతోందన్న వారి ప్రశ్నకు ఎక్కడా సమాధానం దొరకడం లేదు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీల చేతకానితనమూ వారికి బోధపడడం లేదు. ఇప్పుడు

మన రాష్ట్రం కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగా చాలా ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ విధంగా ఇబ్బందులు పడుతున్నది కేవలం ఒక్క మన రాష్ట్రమేనా? అంటే సమాధానం కాదు అనే చెప్పాలి. భారత రాజ్యాంగంలో పొందుపరచిన మూల సూత్రాలలో ఒకటైన ఫెడరల్ స్ఫూర్తిని మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా దెబ్బ తీసి రాష్ట్రాలను నిర్వీర్యం చేసి కేంద్రీకృత, ఏకరూప పాలనను నెలకొల్పాలన్న ప్రయత్నం సాగిస్తోంది. గత పదేళ్ళుగా సాగుతున్న ఈ కుట్రలో భాగంగానే మన రాష్ట్రానికి కూడా నమ్మక ద్రోహం చేశారు. ఈ విషయం లోతుపాతులను భారత కమ్యూనిస్ట్ పార్టీ(మార్క్సిస్ట్) పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బి.వి.రాఘవులు "ఫెడరలిజం అండర్‌మైన్డ్ అండర్ మోడీస్ రూల్" అన్న వ్యాసంలో వివరించారు. ఆంగ్ల త్రైమాసిక పత్రిక మార్క్సిస్ట్ జనవరి–జూన్ 2024 సంచికలో ప్రచురితమైన ఈ వ్యాసాన్ని తెలుగులో పాఠకులకు ఇప్పుడు అందిస్తున్నాం. ప్రస్తుతం మోడీ పాలనలో రాష్ట్రాల అధికారాలు, వనరులు ఏవిధంగా హరించుకుపోతున్నాయో వివరించడంతోబాటు రాష్ట్రాన్ని ప్రత్యామ్నాయ రాజకీయ కార్యాచరణ దిశగా నడిపించడానికి దోహదం చేసే భావాలు, ప్రతిపాదనలు కూడా ఈ వ్యాసంలో ఉన్నాయి. ఈ వ్యాసాన్ని పుస్తకరూపంలో ప్రజాశక్తి బుక్‌హౌస్ మీముందుంచుతోంది. రాష్ట్ర విశాల ప్రయోజనాలు నెరవేరాలని కోరుకునేవారందరూ తప్పక చదవాల్సిన రచన ఇది.

*– ప్రజాశక్తి బుక్‌హౌస్*

# ఫెడరలిజాన్ని దెబ్బతీస్తున్న మోడీ పాలన

**- బి.వి.రాఘవులు**

**సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు**

**2014**లో నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా బిజెపి నాయకత్వంలో ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టినప్పటినుంచీ అది భారతదేశ ఫెడరల్ వ్యవస్థను అంతకంతకూ దెబ్బ తీస్తోంది. గతంలో ఉన్న ప్రభుత్వాలు కూడా అధికారాన్ని తమ వద్ద కేంద్రీకరించుకోడానికి, రాష్ట్రాల హక్కులను హరించడానికి ప్రయత్నించాయి. కాని మోడీ ప్రభుత్వపు చర్యలు గతంలో ఎన్నడూ లేని పెద్ద మార్పును ప్రతిబింబిస్తున్నాయి. కేవలం కేంద్ర ప్రభుత్వ విధానాలను మాత్రమే అమలు చేసే సాధనాలుగా రాష్ట్రాలను పదే పదే దిగజార్చుతూ కేంద్రం రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని గణనీయంగా కుదించివేసింది. అంతర్జాతీయ, జాతీయ కార్పొరేట్ల కూటమి ప్రయోజనాలను పరిరక్షించడానికి, దానితోబాటు హిందూత్వ మతోన్మాద ఎజండాను అమలు చేయడానికి కేంద్రం పూనుకోవడం ఫెడరలిజం మీద ఈ దాడికి ఆజ్యం పోసింది. దానితో మన రాజ్యాంగానికి పునాదిగా ఉన్న మూల సూత్రాలు మరింతగా హరించుకుపోతున్నాయి. కుట్రపూరితంగా మోడీ ప్రభుత్వం ఫెడరలిజాన్ని దెబ్బ తీస్తున్న క్రమాన్ని గనుక మనం అడ్డుకోనట్టైతే అది మన దేశ సమైక్యతకు, సమగ్రతకు తీవ్ర ప్రమాదంగా పరిణమిస్తుంది.

ఫెడరల్ వ్యవస్థ పై మోడీ ప్రభుత్వం సాగిస్తున్న ఈ విధ్వంసక దాడి పర్యవసానాలు ఏ విధంగా ఉండబోతాయన్నది సక్రమంగా అర్థం చేసుకోవాలంటే ఈ వ్యవస్థ ఏ చారిత్రిక, రాజ్యాంగపర నేపథ్యంలో ఆవిర్భవించినదీ తెలుసుకోవాలి.

## 1. మన రాజ్యాంగ రచన - కేంద్రీకృత ఫెడరల్ వ్యవస్థ

భారత రాజ్యాంగం మొదటి అధికరణ ప్రకారం “ఇండియా, భారత్ అని కూడా పిలవబడేది, రాష్ట్రాల సమైక్యరూపం”. “ కేంద్రంలో యూనియన్ ప్రభుత్వం,

దాని చుట్టూ రాష్ట్రాలు, వాటి వాటికి రాజ్యాంగం నిర్దేశించిన పరిధులలో సార్వభౌమాధికారాన్ని కలిగివుంటాయి"అని డా. బి.ఆర్.అంబేద్కర్ 1948లో రాజ్యాంగ సభలో భారతదేశ రూపాన్ని ఆవిష్కరించారు. భారతదేశం ఒక రాష్ట్రాల ఫెడరేషన్ కాదని, రాష్ట్రాల సమైక్య రూపం అని నొక్కి చెప్తూ, ఆ యా పరిస్థితులను బట్టి రాజ్యాంగం కేంద్రీకృతం గాను, ఫెడరల్ స్వభావంతోను కూడా వ్యవహరిస్తుందని ప్రత్యేకించి చెప్పారు.

దీనిని మరింత వివరిస్తూ, సాధారణ పరిస్థితుల్లో భారతదేశ వ్యవస్థ ఫెడరల్ స్వభావంతో పనిచేసేలా రూపొందించబడిందని డా.అంబేద్కర్ స్పష్టం చేశారు. ఐతే, యుద్ధ సమయంలో గాని, జాతీయంగా అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు కాని అది కేంద్రీకృత చట్రంలో వ్యవహరిస్తుందని, అటువంటి సందర్భాల్లో కేంద్రానికి అధికారాలు మరిన్ని సమకూరుతాయని చెప్పారు.

ఫెడరల్ వ్యవస్థలోనే బలమైన కేంద్రం ఉండే నమూనాను మన రాజ్యాంగ నిర్మాతలు ఎంచుకున్నారు. ఈ ఎంపిక వెనుక ఆనాడు దేశం ఎదుర్కొన్న చారిత్రిక అనుభవాల నేపథ్యం ఉంది. ముఖ్యంగా దేశ విభజన అనుభవాలు ఈ దేశాన్ని ఐక్యంగా ఉంచడానికి, దాని స్థిరత్వాన్ని కాపాడడానికి ఒక బలమైన కేంద్రీకృత అధికారం అవసరం అని నొక్కిచెప్పాయి. కేంద్రం గనుక బలహీనంగా ఉంటే, అది ప్రాంతీయ, విచ్ఛిన్నకర ఉద్యమాల పెరుగుదలకు దారి తీయవచ్చునని, దాని వలన కొత్తగా స్వాతంత్ర్యం పొందిన మన దేశ సమగ్రత దెబ్బ తింటుందని వారు భావించారు.

తమ పెట్టుబడుల సమీకరణకు, సరుకుల అమ్మకానికి వీలుగా ఒక ఏకీకృత మార్కెట్ ను సృష్టించడం భారత బూర్జువావర్గానికి కూడా అవసరం అయింది. అందుచేత వారు కూడా బలమైన కేంద్రం ఉండాలన్న భావనను బలపరిచారు. కేంద్రీకరణ పట్ల మొగ్గు ఉన్న కారణంగానే భారత జాతీయ కాంగ్రెస్ మొదట్లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును వ్యతిరేకించింది. అటువంటి డిమాండ్ల వలన పరస్పరం విరోధులుగా ఉండే విధంగా రాష్ట్రాలు తయారై, దేశ సమైక్యతను దెబ్బ తీస్తాయని ఆ పార్టీ భయపడింది.

భారత రాజ్యాంగం స్వతహాగా కేంద్రీకృత అధికారాలవైపు కొంత మొగ్గు కనపరిచినా, అందులో పలు ముఖ్యమైన ఫెడరల్ సూత్రాలు కూడా పొందుపరచబడ్డాయి. మన దేశం దాదాపు ఒక ఖండం మాదిరిగా ఉంటూ, ఆర్థిక, రాజకీయ సామాజిక వైవిధ్యం చాలా గాఢంగా నెలకొనివున్న వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. ఫెడరలిజం అమలైనప్పుడే ఈ వైవిధ్యం లోనుంచి

సమైక్యతాస్ఫూర్తి రూపొందుతుంది. ఉమ్మడి జాతీయ అస్థిత్వాన్ని, ప్రాదేశిక స్వయంప్రతిపత్తిని, రెండింటినీ సమతూకంలో మేళవించడం సాధ్యపడుతుంది.

భారతదేశ సమగ్రతను పదిలంగా నిలువుకోడానికి, ఘర్షణలను పరిష్కరించుకోడంలో కీలక భూమిక పోషించడానికి, ప్రజాస్వామ్యం స్థిరీకరణకు, పలు ప్రాంతీయ ఆకాంక్షలను సర్దుబాటు చేయడానికి ఒక శక్తివంతమైన వ్యవస్థాగత చట్రంగా ఫెడరలిజం తోడ్పడుతుంది. ప్రజలు ఆశించినవి నెరవేర్చడానికి, దేశ సమైక్యతను నిలబెట్టడానికి కావలసిన అధికార పంపిణీ సమతూకంలో ఉండేలా ఫెడరలిజం తోడ్పడుతుంది.

ఎస్.ఆర్‌బొమ్మై కేసులో 1984లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్రాలంటే కేవలం కేంద్రానికి తోకలు మాత్రమే కాదని, రాజ్యాంగం నిర్వచించిన వాటి హద్దుల్లో రాష్ట్రాలకు అత్యున్నత అధికారాలు ఉన్నాయని స్పష్టం చేసింది. ఫెడరలిజం, ప్రజాస్వామ్యం ఒకదానితో ఒకటి పెనవేసుకునివున్నాయని, ఒకదానిని గనుక బలహీనపరిస్తే రెండవది కూడా దెబ్బ తింటుందన్న అవగాహనను ఈ తీర్పు బలోపేతం చేసింది.

భారతదేశం వంటి విస్తారమైన దేశంలో, కేంద్రీకృతమైన, లేదా, ఏకరూపమైన వ్యవస్థల ఏర్పాటు దిశగా – అవి ఆర్థికమైనవిగాని, రాజకీయమైనవి గాని, సాంస్కృతికమైనవి గాని – చేసే ప్రయత్నాలు ఆర్థిక పురోగతిని ఆటంకపరుస్తాయి. భారతదేశం పురోగమించాలంటే, మరింత ఎక్కువ ఫెడరలిజం కావాలే తప్ప ఉన్నదానిని కుదించకూడదు. ఒక మూల సూత్రంగా ఫెడరలిజం మాత్రమే ఇంత వైవిధ్యభరితమైన మన దేశాన్ని విజయాలవైపు నడిపించగలదు.

## 2. ఫెడరలిజాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నాలు స్వాతంత్ర్యానంతర అనుభవాలు

భారత రాజ్యాంగ నిర్మాతలు ఉన్నతమైన ఉద్దేశ్యాలతో రూపొందించినప్పటికీ, స్వాతంత్ర్యానంతరం కేంద్రంలో ఏర్పడిన ప్రభుత్వాలు తరచూ రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని దెబ్బ తీసే విదంగా అధికారాలను కేంద్రీకరించేందుకే ప్రయత్నించాయి. వైవిధ్యం కన్నా ఏకరూపతకు అధిక ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్రాల ప్రత్యేక ప్రయోజనాలను దేశ సమైక్యతకు అవరోధాలుగా తరచూ పరిగణించడం జరిగింది. ద్రవ్య విధానాలపైన, ఆర్థిక పరమైన నిర్ణయాల ప్రక్రియ పైన రాజకీయ నియంత్రణను అమలు చేయడం వరకే ఈ కేంద్రీకరణ పరిమితం కాలేదు. అది విధానపరమైన నిర్ణయాలను చేసే విషయంలో సైతం రాష్ట్రాల పరిధిని కుదించివేసింది.

ఐతే, దేశ పాలనలో కేంద్రీకరణ దిశగా సాగిన ఈ ప్రయత్నాలకు సవాళ్ళు ఎదురయ్యాయి. స్వతంత్రం వచ్చినప్పటినుంచీ, కేంద్రీకరణ మరింతగా పెరగాలని వాదించే శక్తులకు, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని మరింత పెంచాలని ప్రయత్నించే శక్తులకు నడుమ ఉద్రిక్తతలు కొనసాగుతూవచ్చాయి. ఈ విధంగా కొనసాగిన పోటీ దేశ రాజకీయ దృశ్య రూపాన్ని, ఫెడరలిజం అమలౌతున్న తీరును ప్రభావితం చేసింది.

## తొలినాళ్ళలో స్వయంప్రతిపత్తికై పోరాటాలు

స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ఈ పోటీ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు విషయంలో చెలరేగిన వివాదాల రూపంలో వ్యక్తమైంది. దేశంలో వివిధ జాతుల అస్థిత్వాలు, భాషా-సంబంధిత ఆకాంక్షలు రాష్ట్రాల సరిహద్దులను భాషాప్రాతిపదికన తిరిగి రూపొందించాలన్న డిమాండ్ రూపంలో ముందుకొచ్చాయి. అది 1956లో "రాష్ట్రాల పునర్నిర్మాణ చట్టం" చేయడానికి దారి తీసింది. భారత దేశ ఫెడరలిజంలో ఇది చెప్పుకోదగ్గ ఒక మైలురాయిగా నిలుస్తుంది. భాష ప్రాతిపదికన రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించడానికి అది అధికారికంగా ఆమోదముద్ర వేసింది. ప్రాంతీయ అస్థిత్వాలను గౌరవించే ఫెడరల్ వ్యవస్థను నడిపించడంలో తొలి అడుగులు వేసింది.

## ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం,

## ఫెడరల్ సంస్కరణలు (1970- 1980 దశకాలు)

కాంగ్రెస్ పార్టీ పెత్తనానికి ప్రాంతీయ పార్టీలనుండి, వామపక్ష పార్టీలనుండి గట్టి సవాలు ఎదురవడంతో 1970, 1980 దశకాల్లో దేశ రాజకీయ దృశ్యంలో నాటకీయ మార్పులు చోటు చేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రాలకు మధ్య అధికార పంపిణీ సమాన స్థాయిలో ఉండేవిధంగా ఫెడరల్ నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించాలన్న పిలుపులు రెట్టించిన బలంతో ముందుకొచ్చాయి.

కేంద్ర-రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేయడానికి, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని మరింత బలపరచడానికి తమిళనాడులోని డిఎంకె ప్రభుత్వం 1969లో రాజమన్నారు కమిటీని నియమించింది. అదే విధంగా 1977లో పశ్చిమ బెంగాల్ లో వామపక్ష సంఘటన ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కేంద్ర-రాష్ట్ర సంబంధాల పొందికను సవరించాలని ఒక మెమొరాండం తయారు చేసింది. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయడంలో గవర్నర్ల అనుచితంగా జోక్యం కల్పించుకోడాన్ని ఆ మెమొరాండం ప్రత్యేకించి ఎండగట్టింది.

1984లో ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం బర్తరఫ్అయింది. అది“ గవర్నర్ పదవిని దుర్వినియోగం” చేయడం గా పలువురు పరిగణించారు. ఆ సందర్భంలోనే ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా పలు ‘కాంక్లేవ్’ లను (కూటములను) నిర్వహించాయి. అక్కడ కేంద్ర–రాష్ట్ర సంబంధాల గురించి చర్చించాయి. శ్రీనగర్ లో 1984 లో జరిగిన కాంక్లేవ్ ఒక కీలక ఘట్టం. అందులో డిఎంకె, టిడిపి, అకాలీదళ్, ఆర్పిఐ, అస్సాం జాతీయ దళ్, నేషనల్ కాన్ఫరెన్స్, వామపక్ష పార్టీలు పాల్గొన్నాయి. మరింత సమతూకం ఉండేవిధంగా ఫెడరల్ వ్యవస్థ నిర్మాణాన్ని సవరించాలని ప్రతిపాదించాయి.

## సర్కారియా, పుంఛి కమిషన్లు

ఈ ప్రయత్నాలన్నీ కేంద్ర ప్రభుత్వం మీద వత్తిడిని పెంచాయి. కేంద్ర ప్రభుత్వం 1983లో సర్కారియా కమిషన్ ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ తన నివేదికను 1988లో సమర్పించింది. కేంద్ర–రాష్ట్ర సంబంధాల పరిశీలన కోసం ఏర్పటిన ఆ కమిషన్ మరింత సమతూకం ఉండేలా ఫెడరల్ వ్యవస్థలో మార్పులు చేయాలన్న బలమైన డిమాండ్ కు ప్రతిస్పందించింది. కమిషన్ సిఫార్సుల ఫలితంగా వెంటనే పరిస్థితిలో పెద్ద మార్పులేవీ జరగలేదు కాని, ఈ కాలం కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష ఆధిపత్యానికి ముగింపు పలికింది. ఫెడరలిజాన్ని మరింత చురుకుగా బలపరుస్తూ, కేంద్రీకరణ కు పగ్గాలు వేసిన శకం మొదలైంది.

ఆ తర్వాత వామపక్షాల మద్దత్తుతో ఏర్పడిన యుపిఎ–1 ప్రభుత్వం హయాంలో 2007లో పుంఛి కమిషన్ ఏర్పాటైంది. కేంద్ర–రాష్ట్ర సంబంధాలను పునఃపరిశీలించడం, 1988లో సర్కారియా కమిషన్ ఇచ్చిన నివేదిక లేవనెత్తిన అంశాలను పరిశీలించడం ఈ కమిషన్ పని. పుంఛి కమిషన్ అప్పటికి ఉనికిలో ఉన్న కేంద్ర–రాష్ట్ర సంబంధాల వ్యవస్థను సమీక్షించింది. తన 7 సంపుటాల నివేదికలో 273 సిఫార్సులు చేసింది. ఆ సిఫార్సులలో ప్రాధాన్యత కలిగినవి, విస్తృత ప్రభావాన్ని కలిగించగలిగేవి కొన్ని ఉన్నాయి. రాజ్యాంగంలోని 355, 356 అధికరణాలను కేంద్రం దుర్వినియోగపరచకుండా నివారించేందుకు అవసరమైన సిఫార్సులు వాటిలో ఉన్నాయి. ఉమ్మడి జాబితాలో పొందుపరచిన అంశాలకు సంబంధించి ఏవైనా చట్టాలను ప్రవేశపెట్టేముందు, వాటిగురించి అంతర్రాష్ట్ర మండలి ద్వారా రాష్ట్రాలను కేంద్రం సంప్రదించాలని కమిషన్ సూచించింది. రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిన బిల్లులపై

రాష్ట్రపతి నిర్ణయాన్ని ఆ రాష్ట్రానికి ఆరు నెలల వ్యవధిలోపు తెలియజేయాలని నిర్దేశించే సవరణ చేయాలని చెప్పింది. గవర్నర్ నియామకం విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. గవర్నర్లను యూనివర్సిటీలకు చాన్సలర్లుగా నియమించే సాంప్రదాయానికి ముగింపు పలకాలని సిఫార్సు చేసింది.

కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య సంబంధాలు, సమన్వయం సాఫీగా కొనసాగేందుకు కావలసిన సిఫార్సులను పుంఛి కమిషన్ చేసినప్పటికీ, ఆ నివేదికను యుపిఎ ప్రభుత్వం, ఆ తర్వాత ఎన్‌డిఎ ప్రభుత్వం గాలికొదిలేశాయి. ఆ నివేదిక సిఫార్సులలో చాలావరకు ఆ ప్రభుత్వాలకు రుచించలేదు.

## 3. ఫెడరలిజానికి ఎదురౌతున్న సవాళ్ళు

1990 దశకంలో భారత దేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలలో అల్లకల్లోలం నెలకొంది. ఆ పరిస్థితులు దేశ ఫెడరల్ నిర్మాణానికి పెనుసవాలుగా పరిణమించే పలు అంశాలను ముందుకు తెచ్చాయి. ఈ కాలంలో పాలకవర్గాలు, వాటికి ప్రాతినిధ్యం వహించే రాజకీయ పార్టీలు చాలా ఆత్రంగా నయా ఉదారవాద విధానాలను స్వీకరించాయి. తద్వారా దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ల ప్రయోజనాలకు పెద్ద పీట వేశాయి. ఆర్థిక విధానాలలో వచ్చిన ఈ పెద్ద మార్పుకి తోడు మెజారిటీ హిందూత్వ రాజకీయాలు ఒక బలమైన శక్తిగా ముందుకొచ్చాయి. వాటికి ప్రధానంగా ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రాతినిధ్యం వహించాయి. కార్పొరేట్ల ఆర్థిక ప్రయోజనాలు హిందూత్వ–చోదిత రాజకీయ ఎజండాతో కలగలిసిపోయి ఒక 'కార్పొరేట్–మతోన్మాద' ముఠా తయారైంది. ఇది భారతదేశ ఫెడరల్ వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. హిందూత్వ మత మౌఢ్యాన్ని ఆసరా చేసుకుని సాధించిన రాజకీయ ఆధిపత్యం, మార్కెట్ దోపిడీని సమర్థించే ఆర్థిక ఆధిపత్యం– ఈ రెండూ జంటగా సాగిస్తున్న పెత్తనం ఫెడరల్ వ్యవస్థకు మున్నెన్నడూ చూడని సవాళ్ళను విసిరింది.

### ఫెడరలిజానికి ఆటంకంగా నయా ఉదారవాద విధానాలు

ఆర్థిక సరళీకరణ తో దేశంలో అనుసరించే విధానాల ప్రాతిపదికే మారిపోయింది. ఈ విధానాలకు కేంద్ర స్థానంలో మార్కెట్–చోదిత ఆర్థికాభివృద్ధి ఉంది. "ద్రవ్య వ్యవస్థను గట్టిపరచుకోవడం" అన్న పేరుతో , "స్థూల ఆర్థిక స్థిరత్వం" పేరుతో ఈ విధానాలు రాష్ట్రాలను తమ తమ ప్రత్యేక ఆర్థిక, రాజకీయ ప్రణాళికలను అమలు చేయనివ్వకుండా గణనీయంగా నిరోధించాయి. దేశీయ, విదేశీ కార్పొరేట్లు

దేశంలోని వివిధ ప్రాంతాల్లోకి చొచ్చుకుపోడానికి అవసరమైన బలమైన ప్రాతిపదికను ఏర్పరచాయి. కొద్దిమంది ఎంపిక చేయబడ్డ "ఆశ్రిత పెట్టుబడిదారుల" ప్రయోజనాలను నెరవేర్చే తన ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పాలకపార్టీకి తోడైంది. బలమైన రాష్ట్రాలు ఉండడం, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలు బలంగా ఉండడం అనేవి పాలకపార్టీ దృష్టిలో తన ఆర్థిక లక్ష్యాన్ని సాధించడానికి అవరోధంగా కనిపించాయి.

తాము ప్రతిపాదించిన వ్యవస్థీకృత సర్దుబాట్లను, 'ఆర్థిక క్రమశిక్షణ' విధానాలను అమలు చేయడానికి భిన్న రాజకీయ శక్తుల ఆధ్వర్యంలో నడిచే బలమైన రాష్ట్రాలు ఆటంకాలుగా ఉన్నట్టు ప్రపంచబ్యాంక్, ఇతర అంతర్జాతీయ సంస్థలు భావించాయి.

## హిందూత్వ ఎజండా –ఫెడరలిజం

బిజెపి "అఖండ భారత్" అనే రాజకీయ తాత్విక భావనకు ఆచరణలోకి తేవాలని ప్రయత్నిస్తోంది. ఆ భావన ప్రకారం హిందూ ఆధిక్యతను నెలకొల్పే, ఏకరూపంగా ఉండేలా భారతదేశం మారిపోవాలి. ఈ భావన నేరుగా బహుజాతి, బహుభాషా స్వభావంతో కూడిన ఫెడరల్ సూత్రాలను సవాలు చేస్తోంది. బిజెపి దృష్టిలో ఫెడరలిజం అనేది కేవలం పాలనావ్యవహారానికి సంబంధించిన ఒక తరహా ఏర్పాటు మాత్రమే. అది భారత ప్రజాస్వామ్యంలో ఒక మౌలిక అంతర్భాగం అన్న అవగాహన బిజెపికి లేదు. ఆ పార్టీ అనుసరించే వైఖరి ప్రకారం భారతదేశాన్ని చిన్న చిన్న ముక్కలుగా, ప్రాచీన కాలపు జనపదాల మాదిరిగా విడగొట్టాలి. అధికారాలన్నీ కేంద్రీకృతం కావాలి. ఫెడరల్ నిర్మాణానికి బిజెపి వ్యతిరేకం.

బిజెపి యొక్క ఈ వైఖరి కారణంగానే జమ్ము, కాశ్మీర్, ఈశాన్య భారతం వంటి ప్రాంతాల ప్రత్యేక అస్థిత్వాన్ని పరిరక్షించే రాజ్యాంగ అధికరణాలను అది వ్యతిరేకిస్తోంది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరగాలన్న ప్రతిపాదననూ అది వ్యతిరేకిస్తోంది. భాషా వైవిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందిన త్రిభాషా సూత్రాన్నీ అది వ్యతిరేకిస్తోంది. "ఒకే జాతి, ఒకే ఇండియా" అన్న నినాదంతో బిజెపి సాంస్కృతిక ఏకరూపతను అమలు చేయడానికి పూనుకుంటోంది. తన మతోన్మాద, ఫాసిస్టు తరహా రాజకీయ ప్రాబల్యాన్ని గట్టిపరుచుకునే లక్ష్యం లోలోపల దాచుకుని, తాను చేపట్టే చర్యలను ఆర్థిక పరంగా, పాలనాపరంగా సమర్థించుకునే ముసుగు లో వ్యవహరిస్తోంది. దీని పర్యవసానంగా రాష్ట్రాల రాజకీయ, ఆర్థిక శక్తిని కుదించివేస్తూ, ఫెడరల్ వ్యవస్థను దెబ్బ తీసే విధంగా కుట్రపూరితంగా సాగే ప్రయత్నాలు తెరమీదకు వచ్చాయి.

## 4. ఫెడరలిజం పై దాడి: కేంద్రీకరణ దిశగా మోడీ ప్రభుత్వ వత్తిడి

గతంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ గా ఉన్న మోడీ ఎదిగి 2014లో అధికారాన్ని చేపట్టడం. కేంద్రీకరణ ముందెన్నడూ లేనంత హెచ్చు స్థాయిలో జరగడం మొదలై, భారతదేశ ఫెడరల్ వ్యవస్థ దిశ పెద్ద మార్పుకు లోనైంది. ఫెడరల్ వ్యవస్థను కూలదోసి ఫెడరల్ సూత్రాల చట్ట సమ్మతినే నిరాకరించేవిధంగా మోడీ ప్రభుత్వ యంత్రాంగపు దాడి పనిగట్టుకుని ఉధృతంగా సాగుతోంది.

కేంద్ర మంతిత్వ శాఖల, కేంద్ర విభాగాల లక్ష్యాలను నెరవేర్చే సాధనాలుగా మాత్రమే రాష్ట్రాలను పరిగణిస్తూ వాటి రాజకీయ, ఆర్థిక స్వతంత్రతను కేంద్ర ప్రభుత్వం అంతకంతకూ కుదించివేస్తోంది. కేంద్ర విధానాలను ప్రజలకు చేరవేసే ఏజంట్లుగా మాత్రమే రాష్ట్రాలను భావించే పరిస్థితి నెలకొంది, తమ ప్రాంతాల ప్రత్యేకతలకను గుణంగా ఉండే లక్ష్యాలను అమలు చేయడానికి రాష్టాలకు అవకాశాలు నిరాకరించబడుతున్నాయి.

కొన్ని మెత్తగాను, మరికొన్ని గట్టిగాను ఉండే చర్యల ద్వారా మోడీ ప్రభుత్వం తన కేంద్రీకృత రాజకీయ, సాంస్కృతిక ఎజండాను ముందుకు తెచ్చింది. పాలనా విధానాలు, ఆర్థిక వ్యూహాలు మెత్తని చర్యలైతే, రాజ్యాంగానికి, చట్టాలకు సవరణలను తీసుకువచ్చేందుకు పూనుకోవడం గట్టి చర్యలు. ఈ రెండురకాల చర్యలూ మొత్తంగా ఫెడరల్ సమతూకాన్ని దెబ్బ తీసి కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రాలకు మధ్య ఉన్న అధికారాల గమనాన్ని పునర్నిర్వచిస్తున్నాయి. భారతదేశ ఫెడరల్ వ్యవస్థ పునాదులనే సవాలు చేస్తున్నాయి.

### రాజకీయ రంగంలో

### ఒకే దేశం: ఒకే ఎన్నిక - భారతదేశ ఫెడరల్ వ్యవస్థకు, ప్రజాస్వామిక వైవిధ్యానికి సవాలు

హిందూత్వ నినాదం అయిన "ఒకే దేశం, ఒకే సంస్కృతి, ఒకే భాష" అమలు చేయడానికి బిజెపి దూకుడుగా ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నానికి "ఒకే దేశం–ఒకే ఎన్నిక" విధానం తోడైంది. ఈ ప్రతిపాదనను ప్రధాని మోడీ స్వయంగా బుజాన వేసుకుని ముందుకు తెచ్చారు. జాతీయ, రాష్ట్రస్థాయి, స్థానిక ఎన్నికలను అన్నింటినీ ఒకేసారి జరిపే లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. 2014 ఎన్నికల్లో బిజెపి మానిఫెస్టో లో 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' ఒక భాగం. దీనిని 2015 లో ఒక పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమర్థించింది. 2017 లో నీతి ఆయోగ్ విడుదల చేసిన విధానపత్రం,

2018లో లా కమిషన్ విడుదల చేసిన ముసాయిదా నివేదిక కూడా దీనిని సమర్థించాయి. బిజెపి ప్రతిపాదనకు కొంత ప్రతిష్ట కలిగించడానికి ఏర్పాటు చేసిన కోవింద్ కమిటీ 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' ను బలపరుస్తూ సిఫార్సులు చేసింది. వాటిని వెంటనే, 2023 సెప్టెంబర్ 18న, 2024 ఎన్నికలు జరగబోయే ముందు, కేంద్ర క్యాబినెట్ ఆమోదించేసింది. ఒకేసారి ఎన్నికలు జరపడవ వలన ఖర్చులు తగ్గుతాయని, పాలనాయంత్రాంగం పై భారం తగ్గుతుందని, మోడల్ ప్రవర్తనా నియమావళి కారణంగా ప్రభుత్వ నిర్ణయాల అమలు ఆలస్యం అవడం అనేది నివారించబడుతుందని ఆ కమిటీ వాదించింది.

ఐతే, ఈ సమర్ధనలు చాలా పేలవమైనవి. ఎన్నికల్లో ఖర్చులు ఎప్పుడూ పోటా పోటీగా ఉంటాయి గనుక ఒకేసారి జరిగినంతమాత్రాన అవేమీ తగ్గిపోయే అవకాశం లేదు. ఒకేసారి ఎన్నికలు జరిగినంతమాత్రాన ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడం వంటివి పరిష్కారం అవుతాయని ఖచ్చితంగా చెప్పలేం. అంతకన్నా, ఒకేసారి ఎన్నికలు జరపడం వలన మన రాజ్యాంగ మూల సూత్రమైన ఫెడరలిజం దెబ్బ తింటుంది. ఎన్నికల ప్రక్రియను కేంద్రీకరించడం వలన రాష్ట్రాల స్వయంప్రతిపత్తి దెబ్బ తింటుంది. ప్రాంతీయ అంశాల ప్రాధాన్యత తగ్గిపోతుంది. ఒక ఏకరూప రాజకీయ సంస్కృతి నెలకొంటుంది.

'ఒకే దేశం–ఒకే ఎన్నిక' లో స్థానిక, రాష్ట్ర స్థాయి ప్రాధాన్యతలను జాతీయ అంశాలు పక్కకు నెట్టివేస్తాయి. ప్రాంతీయ అంశాల ప్రాతినిధ్యం బలహీనపడుతుంది. పార్లమెంటు ఎన్నికలలోగాని, రాష్ట్ర ఎన్నికలలో గాని సంబంధిత నియోజకవర్గాల సమస్యలు ముందుకు వస్తాయి. ఐతే 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' వలన రాజకీయ చర్చ యావత్తూ కేంద్రీకృతం అవుతుంది. అప్పుడు జాతీయ పార్టీలతో పోటీ పడడం ప్రాంతీయ పార్టీలకు పెద్ద సవాలుగా మారుతుంది. ఎక్కువ వనరులు కలిగివున్న బిజెపికి, అటువంటి ఇతర జాతీయ పార్టీలకు ఇది అనుకూలంగా ఉండవచ్చు కాని ప్రాంతీయ పార్టీలకు ప్రతికూలంగా మారుతుంది. ఎన్నికల పోటీ స్వరూపాన్ని ఒక అధ్యక్ష ఎన్నికల తరహా ప్రచారంగా వక్రమార్గం పట్టించే అవకాశం 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' లో ఉంది. అది రాజకీయ ప్రాతినిధ్యంలో వైవిధ్యం లేకుండా చేస్తుంది.

'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానంలో లోక్‌సభ పదవీకాలం ఐదేళ్ళతో రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలాలను జోడించవలసివస్తుంది. ప్రస్తుతం అమలులో ఉన్న విధానంలో ఒక రాష్ట్రంలో ప్రభుత్వం కూలిపోయి,మధ్యంతరంగా ఎన్నికలు జరగవలసివస్తే అప్పుడు కొత్తగా ఎన్నికయే ప్రభుత్వానికి ఐదేళ్ళ పూర్తి పదవీకాలం

ఉంటుంది. కాని, 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం అమలైతే అప్పుడు ఆ మధ్యంతర ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రభుత్వం జాతీయ స్థాయిలోని ప్రభుత్వానికి ఎప్పుడు ఐదేళ్ళు పూర్తవుతాయో అప్పటివరకు మాత్రమే అధికారంలో ఉంటుంది. ఆ విధంగా ఐదేళ్ళ పూర్తి పదవీ కాలానికి తమ ప్రతినిధులను ఎన్నుకునే హక్కును ఈ విధానం నిరాకరిస్తుంది. రాజ్యాంగం గ్యారంటీ చేసిన హక్కు ను కుదిస్తుంది.

రాజ్యాంగంలోని 174వ అధికరణం కింద ముఖ్యమంత్రి అసెంబ్లీ రద్దుకు సిఫార్సు చేసే అధికారం ఉంది. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' ఆ హక్కును ముఖ్యమంత్రికి లేకుండా చేసి దానిని ప్రధానమంత్రికి కట్టబెట్టే అవకాశం ఉంది. అటువంటి చర్య రాష్ట్రాల సార్వభౌమాధికారాన్ని తీవ్రంగా దెబ్బ తీయడమే గాక భారతరాజ్యాంగానికి మూల సూత్రంగా ఉన్న ఫెడరలిజాన్ని ఉల్లంఘిస్తుంది.

'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానాన్ని పంచాయితీలు, మునిసిపాలిటీలు వంటి స్థానిక సంస్థలకు కూడా వర్తింపజేస్తే అది అధికార వికేంద్రీకరణను బలహీనపరుస్తుంది. భారతదేశపు ప్రాంతీయ వైవిధ్యం దృష్ట్యా, స్థానిక ప్రయోజనాల దృష్ట్యా, పంచాయితీ, మునిసిపల్ ఎన్నికలు రాష్ట్రాల పరిధిలో ఉండడం అవసరం. దేశమంతా ఏక కాలంలో ఎన్నికలు జరిగితీరాలన్న నిబంధన ప్రాంతీయంగా ఉండే తేడాలను విస్మరిస్తుంది. స్థానిక ప్రజల ప్రత్యేక అవసరాలను నిర్లక్ష్యం చేస్తుంది.

'డబుల్ ఇంజన్ సర్కారు' అంటూ బిజెపి ఎత్తుకున్న ప్రచారంకూడా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఒకే రాజకీయ శక్తి లేదా కూటమి చేతుల్లో ఉండాలని అంటుంది. ఇది కూడా 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం వంటిదే. కేంద్ర ప్రభుత్వం లో అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా ఉండే పార్టీలను రాష్ట్రంలో గనుక ఎన్నుకుంటే కేంద్రం రాష్ట్రం పట్ల ఎక్కువ సానుకూలంగా వ్యవహరిస్తుందని హామీ ఇస్తూ, ఈ వ్యూహం రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో కూడా బిజెపి అభ్యర్థులనే ఎన్నుకోవాలని వోటర్లను వత్తిడి చేస్తుంది. ఆచరణలో ఈ వైఖరి ప్రాంతీయ పార్టీలను పక్కకు నెట్టివేయడమే గాక, జాతీయ విధానాలకు లోబడి వ్యవహరించేలా రాష్ట్రాలపై వత్తిడి పెంచుతుంది. దాని ఫలితంగా ప్రాంతీయ స్వయంప్రతిపత్తి, స్వ పరిపాలన దెబ్బ తింటాయి.

## సహకార ఫెడరలిజమా? పీడించే ఫెడరలిజమా?

రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే అందుకు 'సహకార ఫెడరలిజం, పోటీపడే ఫెడరలిజం' కావాలని ప్రధాని మోడీ చాలా దూకుడుగా ప్రచారం చేశారు. కాని

ఆచరణలో చూస్తే, తరచూ నిధులకోసం, వనరులకోసం, కేంద్ర ప్రభుత్వం విధించిన నియమాలకు లోబడి రాష్ట్రాలు తమలో తాము పరస్పరం పోటీపడవలసిన అనివార్య పరిస్థితి ఏర్పడుతోంది. ఇది 'పీడించే' ఫెడరలిజం అని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. నిజమైన ఫెడరల్ స్ఫూర్తిలో పరస్పరం సహకరించుకుంటూ వ్యవహరించే స్వభావం ఉంటుంది. ప్రస్తుతం అమలౌతున్న విధానం రాష్ట్రాలను స్వతంత్రంగా వ్యవహరించగల వ్యవస్థలుగా బలపడనివ్వకుండా, కేంద్రం ఆధిపత్యానికి లోబడి దాని మీదనే అన్నింటికీ ఆధారపడే వ్యవస్థలుగా దిగజార్చుతోంది. ప్రాంతీయ ప్రభుత్వాల స్వయంప్రతిపత్తిని దెబ్బ తీస్తోంది. ఒకే విధమైన విధానాలను అన్ని ప్రాంతాలకూ వర్తింపజేస్తే, అవి అన్ని ప్రాంతాల అవసరాలనూ ఒకే తీరున నెరవేర్చలేవు.

## 5. ఆర్థిక రంగం

## రాష్ట్రాల ఆదాయ పరిస్థితిలో సంక్షోభం

ఆదాయాలను పటిష్టపరచడం, సామర్థ్యాన్ని పెంచడం, స్థిరత్వాన్ని కల్పించడం వంటి పేర్లతో మోడీ ప్రభుత్వ పాలనలో అమలు జరుగుతున్న విధానాలు అంతకంతకూ రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తిని కుదించివేస్తున్నాయి. ఆర్థిక సంఘాలు కాలానుగుణంగా సిఫార్సులు చేస్తున్నప్పటికీ, తమ ఆర్థిక అవసరాలను నెరవేర్చుకోడానికి అవసరమైనంతగా ఆదాయాలను సమకూర్చుకోవడం రాష్ట్రాలకు పెద్ద సవాలుగా మారింది. రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థికవిషయాలలో గల నిర్ణయాధికారం గణనీయంగా తగ్గిపోయింది. వాటి ఆర్థిక వ్యవస్థలు బలహీనపడ్డాయి. అనేక రాష్ట్రాలు నేడు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక దుస్థితికి మూలం కేంద్ర ప్రభుత్వ విధానాలలోనే ఉంది.

ఆర్థిక వనరులపై అజమాయిషీకి సంబంధించి కేంద్ర – రాష్ట్రాల మధ్య ఉండవలసిన పొందిక దెబ్బతిని అది అంతకంతకూ కేంద్రానికి అనుకూలంగా మారిపోతోంది. 2019లో మొత్తం పన్నుల ద్వారా సమకూరిన ఆదాయంలో కేంద్రం 62.5 శాతం తీసుకుంది. రాష్ట్రాలన్నీ కలిపి ఉమ్మడిగా 37.5 శాతం పొందాయి. ఐతే, కేంద్రం, రాష్ట్రాలు కలిపి చేసిన ఖర్చులో రాష్ట్రాల వ్యయం ఏకంగా 62.4 శాతం ఉంది. నిట్టనిలువుగా ఉన్న ఈ అసమ తూకం  ఆ తర్వాత సంవత్సరాలలో మరింత పెరిగింది.

మోడీ పాలనలో రాష్ట్రాలకు చెల్లించవలసిన కేంద్ర పన్నుల వాటా క్రమంగా తగ్గిపోతోంది. దాని ఫలితంగా అసమ తూకం మరింత తీవ్రమైంది. రాష్ట్రాల వాటాను 42 శాతానికి పెంచాలని 14వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. కాని కేంద్ర ప్రాయోజిత పథకాలలో కేంద్రం వాటాతగ్గిపోతూ, రాష్ట్రాలు చేయవలసిన ఖర్చు వాటా పెరిగిపోతూవస్తోంది. దీని వలస రాష్ట్రాలకు కేటాయింపులు పెంచిన ప్రయోజనం దక్కకుండా పోతోంది. కేంద్ర బడ్జెట్లలో గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రాలకు కేటాయించే పన్ను ఆదాయాల వాటా తగ్గిపోతోంది. 2017లో అది 41.1 శాతంగా ఉంటే 2019 నాటికి 32.9 కి, 2023లో 35.1 కి తగ్గింది.

కేంద్రం రెవెన్యూ ఆదాయం సమీకరణ సాపేక్షంగా తగ్గిపోడానికి ఒక కారణం విదేశీ, దేశీయ కార్పొరేట్లకు పన్నుల తగ్గింపు, రాయితీలు, మినహాయింపులు పెరిగిపోవడం. ఈ చర్యల ఫలితంగా రాష్ట్రాలకు పంపిణీ చేయవలసిన పన్నుల వాటా గణనీయంగా తగ్గిపోయింది.

వివిధ సెస్‌ల ద్వారా, సర్చార్జి ల ద్వారా సమకూరే ఆదాయాన్ని కేంద్రం రాష్ట్రాలతో పంచుకోదు. ఇవి 2012లో 10.4 శాతం ఉంటే 2022 నాటికి 18.2 శాతానికి పెరిగాయి. రాష్ట్రాలతో పంచుకోవలసిన పన్ను ఆదాయం తగ్గిపోయింది. మొత్తం ఆదాయంలో రాష్ట్రాలతో పంచుకోవలసిన వాటా 2011లో 88.6 శాతం ఉంటే అది 2021 నాటికి 10 శాతం తగ్గి 78.9 కి చేరింది. స్పెక్ట్రం వేలం పాటల ద్వారా, పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా, ఆస్తుల మానిటైజేషన్ ద్వారా ఒక్కసారి వచ్చిపడే ఆదాయం, రిజర్వుబ్యాంకు లాభాలు వంటి ఆదాయాలను కేంద్రం రాష్ట్రాలతో పంచుకోదు. ఈ వైఖరి వలన కేంద్ర ఆదాయంలో రాష్ట్రాలతో పంచుకోవలసిన వాటా తగ్గిపోతోంది. రాష్ట్రాల ఆదాయ వనరులు తగ్గిపోయి వాటి స్వయంప్రతిపత్తి దెబ్బ తింటోంది.

రుణాలు పొందే విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలు రాను రాను తీవ్రమౌతున్నాయి. మొత్తం మార్కెట్ రుణాల్లో రాష్ట్రాలు కేవలం 15 శాతమే పొందుతున్నాయి. అదే కేంద్రం 85 శాతం పొందుతోంది. దీని ఫలితంగా రాష్ట్రాలు ఆదాయాన్ని సమకూర్చుకునే విషయంలో వెసులుబాటు కోల్పోతున్నాయి. 12వ ఆర్థిక సంఘం సిఫార్సుల అనంతరం, ద్రవ్య బాధ్యత, మరియు బడ్జెట్ నిర్వహణ చట్టాలను (ఫిస్కల్ రెస్పాన్సిబులిటీ అండ్ బడ్జెటరీ మేనేజిమెంట్ ఏక్ట్) చేయవలసిందిగా రాష్ట్రాలను వత్తిడి చేసిన పర్యవసానంగా ఎఫ్ఆర్‌బిఎం చట్టాలను చేయవలసివచ్చింది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే రుణాలు రాష్ట్ర స్థూల ఉత్పత్తి లో (జిఎస్‌డిపి)

3 శాతానికి మించకుండా ఉండేట్టు తమకు తామే పరిమితులు విధించుకోవలసి వచ్చింది.

అసాధారణ పరిస్థితులు నెలకొన్నప్పుడు సైతం ఈ పరిమితులకు మించి రుణాలు తీసుకోడానికి మామూలుగా అనుమతులు ఇవ్వడం లేదు. ఉదాహరణకు: 2020లో కోవిడ్–19 మహమ్మారి వ్యాపించినప్పుడు రాష్ట్రాలు తమ జిఎస్‌డిపి లో 2 శాతం అదనపు రుణాలను తీసుకోడానికి అనుమతించింది కేంద్రం. ఐతే దానికి ముందు 'ఒకే దేశం–ఒకే రేషన్ కార్డు' పద్ధతిని, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్నిపౌర సేవల, పట్టణ సంస్కరణలను, విద్యుత్ రంగంలో సంస్కరణలను చేపట్టాలన్న షరతులను విధించింది.

ఇవన్నీ చాలవన్నట్టు కేంద్రం రాష్ట్రాలు పొందే రుణాలమీద అధిక వడ్డీరేట్లను విధిస్తోంది. దాంతో రాష్ట్రాల ఆర్థిక వనరులు మరింత కరిగిపోతున్నాయి.

ఆదాయాల విషయంలోనే గాక, ఖర్చుల విషయంలో కూడా కేంద్రం అవాంఛనీయమైన వత్తిడులను తెస్తోంది. తద్వారా రాష్ట్రాల వ్యయాలలో ప్రాధాన్యతలు మారిపోతున్నాయి. గత కొంత కాలంగా, ముఖ్యంగా గత దశాబ్ద కాలంలో రాష్ట్రాలకు ఏ షరతులూ లేకుండా ఇవ్వవలసిన గ్రాంట్లు తగ్గిపోతూనేవున్నాయి. 2009లో ఇవి 31.2 శాతంగా ఉంటే 2023 నాటికి 17.4 శాతానికి పడిపోయాయి.

కేంద్ర పే కమిషన్ కాలానుగుణంగా వేతనాలు సవరించాలని చేసిన సిఫార్సులు రాష్ట్రాలపై మరింత భారాన్ని మోపుతున్నాయి. కేంద్రం నుండి ఎటువంటి పరిహారమూ లేకుండానే ఉద్యోగులకు అదనంగా చెల్లించవలసిన వేతనాల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే భరించవలసివస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్థిక తోడ్పాటూ లేకుండా ఈ అదనపు భారాన్ని భరించగల స్థితిలో చాలా రాష్ట్రాలు లేవు.

రాష్ట్రాలు తమకు న్యాయంగా రావలసిన వాటాను పొందాలంటే అవి కేంద్రం ఆదేశించిన సంస్కరణలను అమలు చేసితీరాలన్న ముందస్తు షరతులను ఆర్థిక సంఘం విధించడం పరిపాటి అయిపోయింది. అలా అమలు చేసినప్పుడు మాత్రమే రాష్ట్రాలకు ఆర్థిక తోడ్పాటును కేంద్రం అందిస్తుంది. రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తిని హరించేలా కేంద్ర పథకాలు ఎక్కువభాగం షరతులను విధిస్తున్నాయి. కేంద్ర ప్రాయోజిత పథకాలను, కేంద్ర రంగ ప్రాజెక్టులను అంతకంతకూ ఎక్కువగా ప్రవేశపెడుతూ, కేంద్ర ప్రభుత్వం వాటితోబాటు చాలా కఠినమైన షరతులను విధిస్తోంది. ఈ పథకాలలో

రాష్ట్రాల వాటాను నిరంతరం పెంచుకుంటూ పోతోంది. ఈ పథకాలను ఆమోదిస్తే అప్పుడు అనివార్యంగా కేంద్రం విధించే షరతులకు లోబడి వ్యవహరించవలసి వుంటుంది. దాని వలస రాష్ట్రాలు స్వతంత్రంగా తమ ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రాజెక్టులను, అభివృద్ధి పథకాలను చేపట్టగల శక్తిని కోల్పోతున్నాయి. ఈ విధంగా కేంద్రం తరచూ అనుసరిస్తున్న పీడక విధానాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రాలకు నడుమ అర్థవంతమైన చర్చలు జరగడానికే అవకాశం లేకుండా పోతోంది. ఆర్థిక ఫెడరలిజం సూత్రాలమీద దాడి ఈ విధంగా సాగుతోంది.

వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) వ్యవస్థ కేంద్రానికి చెందవలసినదానికన్నా ఎక్కువ చెందేట్టు చేసింది. ఆదాయాల్లో 14 శాతం కనీసం వృద్ధి ఉంటుందని, ఆదాయాల్లో స్థిరత్వం వచ్చేవరకూ పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చినా దానిని నెరవేర్చలేదు. జిఎస్‌టి పరిహారాన్ని కూడా నిలిపివేశారు. రాష్ట్రాలు అభ్యంతరాలు పెడుతున్నా, జిఎస్‌టి సలహామండలిలో కేంద్రానికి ఎక్కువ వోటింగ్ హక్కులు ఉన్నందున అది రాష్ట్రాల ఆందోళనలను పట్టించుకోవడం లేదు. జిఎస్‌టి బకాయిల చెల్లింపు ఆలస్యం చేయడం వలన, ముఖ్యంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు, కేంద్రం మీద ఆర్థికంగా ఆధారపడడం మరింత పెరిగిపోతోంది. కేంద్ర అధికారుల దయా దాక్షిణ్యాలకు అర్రులు చాచవలసివస్తోంది.

2016లో హఠాత్తుగా పెద్ద నోట్లను రద్దు చేయడం, కోవిడ్-19 కాలంలో దేశవ్యాప్తంగా ఉన్నట్టుండి లాక్‌డౌన్ విధించడం వంటివి రాష్ట్రాలను సంప్రదించకుండానే చేశారు. దాని ఫలితంగా ఆర్థికవనరులు దెబ్బ తినడమే కాకుండా ఆదాయాలపైన కూడా ప్రభావం పడింది. రాష్ట్రాలనుండి ఏ విధమైన అభిప్రాయాలనూ కోరకుండానే జాతీయ విపత్తుల నిర్వహణ చట్టాన్ని చేశారు. అది సరుకుల రవాణాపై, ప్రజల కదలికలపై విపరీతమైన అధికారాలను కేంద్రానికి కట్టబెట్టింది. ఆ విధంగా సహకార ఫెడరలిజం సూత్రాల ఉల్లంఘన జరిగింది. పిఎం కేర్స్ ఫండ్ చాలా రహస్యంగా నిర్వహింబడుతోంది. ఎటువంటి పారదర్శకతా లేదు. ప్రజలకు జవాబుదారీతనమూ లేదు.

కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తి దిగజారిపోవడం భారతదేశ ఫెడరల్ నిర్మాణానికి తీవ్ర సవాలుగా పరిణమించింది. కేంద్రం సహకార ఫెడరలిజం గురించి ఉపదేశాలు ఇస్తున్నా, అది అనుసరిస్తున్న

విధానాలు – ద్రవ్య విధానం లో మార్పులనుండి, ఆర్థిక తోడ్పాటుకు షరతులు విధించడం వరకూ – రాష్ట్రాలు తమ స్థానిక అవసరాలను స్వతంత్రంగా తీర్చుకోగలిగే శక్తిని క్రమంగా నిర్వీర్యపరిచాయి. భారత దేశంలోని రాష్ట్రాలు ఎదుర్కొంటున్న ద్రవ్య, ఆర్థిక సవాళ్ళు ఫెడరల్ ద్రవ్య వ్యవస్థలో తక్షణమే సంస్కరణలు తీసుకురావలసిన అవసరాన్ని వెలుగుతోకి తెస్తున్నాయి. రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తిని మెరుగుపరచడం. పారదర్శకతను పెంచడం, వనరులను సమతూకంతో పంపిణీ చేయడం వంటివి అసలైన సహకార ఫెడరలిజాన్ని పెంపొందించడానికి తోడ్పడతాయి. రాష్ట్రాలు తమ స్థానిక అవసరాలను  మరింత మెరుగ్గా నెరవేర్చగలిగేలా వాటికి బలాన్ని చేకూర్చుతాయి. భారత ఫెడరల్ వ్యవస్థలో మరితంత సమన్యాయంతో కూడిన, సమర్ధవంతమైన ఆర్థిక చట్రం రూపొందడానికి ఈ చర్యలు తోడ్పడతాయి.

## ఫెడరలిజం – దిగజారుతున్న  వ్యవస్థాగత ఏర్పాట్లు

కేంద్ర–రాష్ట్ర సంబంధాల సమస్యలపై చర్చించి పరిష్కరించుకోడానికి, రాజకీయ వ్యవస్థలోని ఫెడరల్ స్ఫూర్తిని పరిరక్షించడానికి వీలుగా  రాజ్యాంగం వివిధ వ్యవస్థల్ని ఏర్పాటు చేసింది. అంతర్రాష్ట్ర సలహామండలి, జాతీయ సమైక్యతామండలి, జాతీయ అభివృద్ధి మండలి, ప్రణాళికా సంఘం, ఆర్థిక సంఘం, రిజర్వు బ్యాంక్ బోర్డు తదితర ఆర్థిక సంస్థలు ఈ వ్యవస్థలలో భాగం. ఈ వ్యవస్థలన్నీ దాదాపు కేంద్ర ప్రభుత్వ భాగాలుగానే వ్యవహరిస్తూ, అధికార వ్యవస్థను కేంద్రీకరిస్తూ, తమ సిఫార్సుల ద్వారా షరతులను రుద్దుతున్నాయి. ఈ సంస్థలలో రాష్ట్రాల ప్రయోజనాలు సక్రమంగా, తగినంతగా వ్యక్తం కావడం లేదు.

మోడీ పాలనలో అంతర్రాష్ట్ర మండలి పూర్తిగా పని చేయడం మానివేసింది. 2016లో కేవలం ఒక్కసారి మాత్రమే, కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై  పుంఛి కమిషన్ సిఫార్సులను పరిశీలించడానికి  సమావేశం జరిపింది.

## జాతీయ  అభివృద్ధిమండలి

మోడీ పాలనలో జాతీయ అభివృద్ధి మండలి రద్దు కావడంతో  రాష్ట్రాల అధికారాలకు పెద్ద దెబ్బ తగిలింది. జాతీయ అభివృద్ధిమండలిని రద్దు చేసి దాని స్థానంలో ప్రాంతీయ మండళ్ళను ఏర్పాటు చేయడంతో విధానాలపై రాష్ట్రాల అభిప్రాయాలకు గల విలువ పరిమితమైపోయింది. నిధుల రాక మరింత తగ్గిపోయింది.

జాతీయ ఆర్థిక అభివృద్ధి కి సంబంధించిన విషయాలలో రాష్ట్రాల గొంతుక స్థాయిని ఇది తగ్గించివేసింది. అన్ని రాష్ట్రాలూ ఒకదగ్గర సమావేశమైనప్పుడు అవి ప్రదర్శించగల ఆత్మవిశ్వాసం, ప్రధాన సమస్యలమీద రాష్ట్రాలన్నీ ఒకే మాటమీద నిలిచినప్పుడు కేంద్రం మీద అది కలిగించే వత్తిడి ఇప్పుడు లేవు. దానికి బదులు కేంద్రాన్ని బతిమిలాడుకునే వాతావరణం ఏర్పడింది. అప్పుడప్పుడు జరిగే ప్రాంతీయ సమావేశాల్లో వేడుకునే రాష్ట్రాల బృందం కేంద్రాన్ని మరింత దయ చూపమని బతిమిలాడుకోవడం జరుగుతూవుంటుంది.

## నీతి ఆయోగ్

2014 ఆగస్టు 15న తన స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో ప్రధాని మోడీ ప్రకటించిన తొలి ప్రధాన సంస్కరణలలో ప్రణాళికా సంఘాన్ని రద్దు చేయడం ఒకటి. దాని స్థానంలో భారతదేశాన్ని మార్చివేసే జాతీయ సంస్థ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) ఎన్ఐటిఐ లేదా నీతి ఆయోగ్ 2015 జనవరి 1న ఏర్పడింది.

కేంద్ర ప్రభుత్వం వద్ద అధికారాలు మరింత కట్టుదిట్టం కావడానికి, ప్రపంచబ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థల పాత్రను తానే పోషిస్తూ నయా ఉదారవాద సంస్కరణలను మరింత లోతుగా అమలు చేయడానికి ప్రతీకగా నీతి ఆయోగ్ ఉంది. ప్రజల ఆస్తులను ప్రైవేటు సంస్థలకు బదలాయించడానికి, సంక్షేమ కార్యక్రమాలలో రాష్ట్రాల పాత్రను కుదించడానికి, పరిపాలన యావత్తూ ప్రధానంగా పాలకవర్గాల ప్రయోజనాలను నెరవేర్చడానికి మాత్రమే ఇది ఏర్పడింది. ఈ సంస్థ కీలక పత్రాలలో, దాని మూడు సంవత్సరాల కార్యాచరణ ఎజండాలో, తదనంతరం విడుదల చేసిన విజన్ డాక్యుమెంట్లలో దాని ఉద్దేశ్యం స్పష్టంగా కనిపిస్తుంది.

మూడు పత్రాల ద్వారా నీతి ఆయోగ్ తన అభివృద్ధి నమూనాను వెల్లడించింది. అవి

1. 15 సంవత్సరాల విజన్ (2017–18 నుంచి 2031–32 వరకు)
2. ఏడు సంవత్సరాల వ్యూహం (2017–18 నుంచి 2023–24 వరకు)
3. మూడేళ్ళ కార్యాచరణ ఎజండా (2017–18 నుంచి 2019–20 వరకు)

పెట్టుబడికి ఉండే "జంతుప్రవృత్తిని విడుదల చేసేందుకు" మార్కెట్–చోదిత సంస్కరణలను అమలు చేయడం గురించి ఈ పత్రాలు నొక్కిచెప్పాయి. తనకు ముందు ఉండిన ప్రణాళికాసంఘం ఆర్థిక ఫెడరలిజం అమలుకు దోహదం చేసేలా, అభివృద్ధిలోని అసమానతల పరిష్కారానికి తోడ్పడేలా నిధులను మంజూరు చేస్తే, అందుకు భిన్నంగా నీతి ఆయోగ్ ఆర్థిక శక్తిని కేంద్రీకరించడం మీద దృష్టినంతటినీ కేంద్రీకరించింది. ఈ మార్పు ఆర్థిక మంత్రిత్వ శాఖకు బలాన్ని చేకూర్చింది. వనరుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం మరింత ఎక్కువగా తన పెత్తనాన్ని చెలాయించడానికి తోడ్పడింది.

ఆయా ప్రాంతాల మధ్య, సామాజిక తరగతులమధ్య సమానత్వం పెంపొందడానికి ప్రణాళికాసంఘం తోడ్పడి కీలకభూమిక పోషించింది. అందుకు కావలసిన వనరులను ప్రణాళికా గ్రాంట్ల రూపంలో అందించింది. సంప్రదింపులు జరపడానికి అది పూనుకున్నందున నిర్ణయాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒక మేరకు భాగస్వాములవడానికి అవకాశం కలిగింది. కాని అది కాస్తా రద్దు కావడంతో రాష్ట్రాలు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మీద భారీగా ఆధారపడవలసివస్తోంది. ఆ కేంద్ర ప్రభుత్వం తన ఆర్థిక మంత్రిత్వ శాఖ ద్వారా మరింత గట్టిగా నిధుల మంజూరును అదుపు చేస్తోంది.

సహకరించే విధంగా ఉండే ప్రణాళికాసంఘం పద్ధతులకు పూర్తి విరుద్ధంగా ఉండే పద్ధతులను నీతి ఆయోగ్ ప్రవేశపెట్టింది. రాష్ట్రాలకు ర్యాంకులను సూచించే విధానం, "వ్యాపారాన్ని సరళతరం చేయడం" (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి చట్రాలను ప్రవేశపెట్టడం జరిగింది. ఈ ఏర్పాట్లతో  పెట్టుబడులను ఆకర్షించడం కోసం  రాష్ట్రాల నడుమ నెలకొల్పే పోటీ వాటిని చితికిపోయేలా చేస్తుంది. అంతేకాక, ప్రైవేటు రంగం భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది. రాష్ట్రాలకు మరింత వెసులుబాటు కల్పించేబదులు ఈ పోటీ నమూనా వాటిపై అనేక పరిమితులను తెచ్చిపెట్టింది.

కేంద్ర ప్రభుత్వ రాజకీయ ఎజండాకు సన్నిహితంగా నీతిఆయోగ్ పనివిధానం అల్లుకునివుంటుంది. కార్పొరేట్ల ఆర్థిక శక్తిని మరింత పెంచడానికి తోడ్పడేవిధంగా ఉండే సంస్కరణలను సిఫార్సు చేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాలను బలపరిచేవిధంగా ఉండే నివేదికలను అతికినట్టు తయారు చేయడం అది తరచూ చేస్తుంది. నీతి ఆయోగ్

ఏర్పడినప్పటినుంచి ఫెడరలిజాన్ని దెబ్బ తీయడానికి, ఆర్థిక కేంద్రీకరణను మరింత కట్టుదిట్టంగా చేయడానికి ఒక సాధనంగా ఉపయోగపడింది.

## ఆర్థిక సంస్థలు

కేంద్ర ప్రభుత్వ విధానాల అమలుకు తోడ్పడే పనిముట్లుగా పని చేసేట్టు రిజర్వుబ్యాంక్, ఇతర ఆర్థిక సంస్థలు మార్చబడ్డాయి. దేశ ద్రవ్య, ఆర్థిక స్థిరత్వాన్ని పరిరక్షించడం వీటి బాధ్యత అయినప్పటికీ, వాటి పాలకమండళ్ళు, విధానాలు కేంద్ర ప్రభుత్వం ద్వారా నియమితులైన వ్యక్తులద్వారా ఆదేశించబడతాయి. అందువలన జాతీయ ఆర్థిక సంస్థలు తీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేయగల శక్తి రాష్ట్రాలకు చాలా పరిమితం అయిపోయింది. వాటి ఆర్థిక స్తోమతను దెబ్బ తీసింది.

## ఆర్థిక మండలి (ఫైనాన్స్ కమిషన్)

నయా ఉదారవాద విధానాల అమలు మొదలైనప్పటినుంచీ ద్రవ్య విధానాలను కట్టుదిట్టంగా అమలు చేసే పేరుతో, సామర్థ్యం పెంపు పేరుతో ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రాలు తమవైన స్వతంత్ర, ఆర్థిక  రాజకీయ ప్రణాళికలను చేపట్టడానికి గల అవకాశాలను కుదించివేసింది. అది ఒక రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన సంస్థ అయినప్పటికీ, ఫైనాన్స్ కమిషన్ ను కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. అది పరిశీలించవలసిన అంశాలను కూడా కేంద్రమే, రాష్ట్రాలతో సంప్రదించకుండానే నిర్ధారిస్తుంది. అందులోని సభ్యులను కేంద్రమే నియమిస్తుంది. ఇందులో రాష్ట్రాలను సంప్రదించడం అంటూ వుండదు. ఇటీవల మోడీ హయాంలో అది రాష్ట్రాలమీద కఠినమైన షరతులను విధించే సాధనంగా వ్యవహరిస్తోంది. రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాలకు చెందవలిన వనరులను పొందడానికి కూడా ఈ షరతులు అడ్డం వస్తున్నాయి.

ఉదాహరణకు 12వ ఫైనాన్స్ కమిషన్ ఎఫ్ఆర్బిఎం చట్టాన్ని అమలు చేయాలన్న షరతును విధించింది. లోటును తగ్గిస్తేనే ఆ లోటును భర్తీ చేసే గ్రాంట్లను మంజూరు చేస్తామని షరతు పెట్టింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి లో ఆ లోటు 3 శాతానికి మించరాదని పరిమితి విధించింది. 14వ ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రాలకు కేటాయించిన పన్నులను 10 శాతం మేరకు పెంచింది. కాని కేంద్ర ప్రాయోజిత పథకాల కింద కేంద్రం ఇచ్చే గ్రాంట్లకు కోత పెట్టింది.

16వ ఫైనాన్స్ కమిషన్ డిసెంబర్ 2023లో ఏర్పాటైంది. నీతి ఆయోగ్ కు గతంలో ఉపాధ్యక్షుడిగా వ్యవహరించిన అరవింద్ పనగారియా ఈ కమిషన్ కు చైర్మన్ గా నియమితులయ్యారు. అతడు నయా ఉదారవాద, స్వేచ్ఛామార్కెట్ సిద్ధాంతానికి కట్టుబడ్డ ఆర్థికవేత్తగా పేరు పొందిన వ్యక్తి. ఈ కమిషన్ సిఫార్సులు 2026–2031 మధ్య కాలానికి వర్తిస్తాయి. చైర్మన్ సైద్ధాంతిక దృక్పథం దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల దృష్ట్యా ఈ బలమైన ప్రజా ఉద్యమాల ద్వారా వత్తిడి తెస్తే తప్ప ఈ కమిషన్ ద్వారా రాష్ట్రాలకు సానుకూలమైన సిఫార్సులు వస్తాయని ఆశించలేం.

ఇటీవల త్రివేంద్రంలో ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం జరిగింది. వనరుల కేటాయింపుల్లో నిట్టనిలువుగా పెరుగుతున్న అసమతూకాన్ని గురించి ఆ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. దిగువ ప్రతిపాదనలను అది చేసింది:

1. **పన్నులలో వాటాను పెంచాలి:** కనీసం 50 శాతం పన్నులను రాష్ట్రాలకు కేటాయిస్తే తప్ప అవి తమ వ్యయానికి సంబంధించిన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చలేవు.
2. **సెస్‌లను, సర్‌చార్జిలను తగ్గించాలి:** సెస్ లను, సర్‌చార్జిలను పరిమితమైనా చేయాలి. వీలైతే మొత్తంగా రద్దు చేయాలి. లేదా వాటిని రాష్ట్రాలతో పంచుకునేందుకు సిద్ధపడాలి. అప్పుడు రాష్ట్రాలకు అందుబాటులో ఉండే వనరులు తరిగిపోకుండా ఉంటాయి.
3. **కేంద్ర ప్రాయోజిత పథకాలను సంస్కరించాలి:** ఈ పథకాల నిబంధనలను సవరించి రాష్ట్రాలు తమ స్థానిక అవసరాలకు తగ్గట్టు వాటిని అమలు చేసేందుకు అవసరమైన వెసులుబాటును కల్పించాలి. తద్వారా కేంద్రం మీద ఆర్థికంగా ఎక్కువగా ఆధారపడే స్థితిని మార్చాలి.
4. **రుణ షరతులను మెరుగుపరచాలి:** కేంద్రం ఇచ్చే రుణాలపై వడ్డీని తగ్గించాలి. అప్పుడు రాష్ట్రాల మీద ఆర్థిక వత్తిడి తగ్గుతుంది. నిధులను ప్రాధాన్యను బట్టి కేటాయించడానికి వీలౌతుంది.

ఈ ప్రతిపాదనలు గనుక సానుకూలంగా పరిశీలించబడితే, అవి రాష్ట్రాల పాలన కొనసాగడానికి, ఫెడరల్ స్ఫూర్తిని బలపరచడానికి తోడ్పడతాయి.

# ముగింపు

మూడవసారి అధికారం చేపట్టినప్పుడు మోడీ ప్రభుత్వం కొన్ని ప్రాంతీయ పార్టీల మద్దత్తు మీద ఆధారపడినప్పటికీ, గత రెండు పదవీకాలాల్లోనూ కనపరిచిన విధాన దిశ నుండి అది ఇప్పుడు కూడా ఏమాత్రమూ పక్కకు మళ్ళలేదు. నయా ఉదారవాద ఆర్థిక విధానాలను రెట్టించిన ఊపుతో అమలు చేస్తోంది. తన హిందూత్వ–మత తత్వ ఎజండాను ఎక్కడా ఆపకుండా ముందుకు తీసుకుపోతోంది. తనను వ్యతిరేకించే రాష్ట్ర ప్రభుత్వాలపై అది కుట్రపూరితంగా దాడి చేస్తోంది. ఆర్థికంగాను, రాజకీయంగాను కూడా ఆ దాడి సాగుతోంది. ఫెడరల్ వ్యవస్థకు కీలకమైన సంస్థలను, పద్ధతులను అది దెబ్బ తీస్తోంది.

సంకీర్ణ ప్రభుత్వానికి ఉండే పరిమితులు మోడీ ప్రభుత్వాన్ని అదుపు చేయగలవని ఆశించడం అమాయకత్వమే ఔతుంది. పీడించడం, వంచించడం అనే రెండు పద్ధతులనూ కలగలిపి అది తన సంకీర్ణ భాగస్వాములను తన చెప్పుచేతల్లో ఉంచుకుంటోంది. అందుచేత ఈ ప్రభుత్వ వినాశకర విధానాలను ప్రతిఘటించడానికి అన్ని ప్రజాస్వామిక, లౌకిక, అభ్యుదయ శక్తులనూ ఐక్యం చేసి ప్రతిఘటనకు పూనుకోవడమే మన ముందున్న ఒకే ఒక మార్గం. ఈ విశాల పోరాటంలో ఫెడరల్ వ్యవస్థ పరిరక్షణ కోసం జరిగే పోరాటం కూడా ఒక ముఖ్యమైన అంతర్భాగంగానే ఉంటుంది.

* * *